కఠినమైన చట్టాలు తీసుకురావాలి



ప్రభుత్వ ఆస్పత్రుల్లో పని చేసే వైద్య విద్యార్థులు కొన్నిసార్లు ఎక్కువ గంటలు పనిచేయాల్సి వస్తుంది. ఇలాంటి పరిస్థితుల్లో విశ్రాంతి కోసం హాస్టళ్లకు వెళ్లే సమయంలోనే వైద్య విద్యార్థులపై దాడులు జరుగుతున్నాయి. డ్యూటీ చేసే ప్రదేశంలోనే విశ్రాంతి గదులు కేటాయిస్తే బాగుంటుంది. వైద్య విద్యార్థులకు రక్షణ కల్పించే కఠినమైన చట్టాలను తీసుకు రావాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

- డాక్టర్ పావని, సివిల్ అసిస్టెంట్ సర్జన్, కడప

వైద్యులకు భద్రత కల్పించాలి



కోల్‌కతా మహిళా వైద్యురాలిపై జరిగిన ఘటన తీవ్రంగా కలిచి వేసింది. ఇలాంటివి పునరావృతం కాకుండా ప్రభుత్వాలు కఠిన చర్యలు చేపట్టాలి. అధికారులు కూడా ఈ విషయంగా మేల్కోవాలి. మిగిలిన రాష్ట్రాల్లో మహిళా వైద్యులు, సిబ్బందికి అండగా నిలవాలి. వైద్య వృత్తితో ప్రజలకు సేవ చేయాలని ఈ వృత్తిలోకి వచ్చాం. చనిపోయే వారిని కూడా బతికించిన సంఘటనలు ఎన్నో ఉన్నాయి. అలాంటి ప్రాణదాతలకే రక్షణ లేకుంటే ఎలా?

- డాక్టర్ అక్షిత, గైనకాలజిస్టు, కడప



పేదలకు సేవ చేయడమే పరమావధి



వైద్య వృత్తిలో పేదలకు సేవ చేయడమే పరమావధిగా కష్టాలు భరిస్తున్నాం. రాత్రివేళ ఏమైనా జరిగితే మాకు దిక్కెవరు? కనీస వసతులు లేకపోతే ఎలా? కోల్‌కతా ఘటనపై దేశంలో అన్ని రాష్ట్రాల వైద్యులు ఈ విధంగా ధర్నాలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వం వైద్యులపై దాడి చేసిన వారిపై కఠిన శిక్షలు అమలు చేస్తే దేశంలో ఇలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా ఉంటాయి.

- డాక్టర్ సబీహ, వైద్య విద్యార్థిని, కడప

బయటికి రావాలంటే భయంగా ఉంటోంది



ఆస్పత్రిలో పనిచేసే డాక్టర్లు, నర్సులకు రోగుల మధ్య ఉన్నప్పుడు ఎవరైనా దుర్భాషలాడినా, కొట్టినా రక్షణ లేకుండా పోతోంది. ఆస్పత్రిలో సెక్యూరిటీ వ్యవస్థ సక్రమంగా లేదు. కొంతమంది అపరిచిత వ్యక్తులు ఆస్పత్రుల్లోకి వస్తుంటారు. వారు వచ్చినపుడు భయంభయంగా గదుల్లోకి వెళ్లాల్సి వస్తోంది. ఎప్పుడు ఏం జరుగుతుందోనన్న ఆందోళన కూడా ఉంది. సెంట్రల్ ప్రొటెక్షన్ యాక్టు ఉంటే ఇలాంటి వారికి శిక్షలు పడే అవకాశం ఉంటుంది.

- డాక్టర్ మిస్బా, వైద్య విద్యార్థిని, కడప

క్లుప్తంగా

వలంటీర్ల జీవితాలతో చెలగాటం వద్దు

కడప వైఎస్ఆర్ సర్కిల్ : రాజకీయ పార్టీల స్వార్థాల కోసం వలంటీర్ల జీవితాలతో చెలగాటం ఆడవద్దని, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జి. ఈశ్వరయ్య, ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నక్కి లెనిన్ బాబు ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో జిల్లా వలంటీర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వలంటీర్లకి రూ. 10,000 జీతం ఇస్తామని, అలాగే ఉద్యోగ భద్రత కల్పిస్తామని ఇచ్చిన వాగ్దానాన్ని తక్షణమే నెరవేర్చాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ వలంటీర్స్ అసోసియేషన్ నాయకులు కే వెంకటసుబ్బయ్య, సుబ్బారెడ్డి, ఎస్ సయ్యద్, ఎస్ నరసింహ, ఎం సురేష్, ఎస్ శ్రీధర్, వి.వెంకటరమణ, ఈ.డాబర్ బాష, ఎల్ శ్రీను, వై వెంకటేష్, సురేష్, షేక్ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

మానవతావాది మదర్ థెరిస్సా



మదర్ థెరిస్సా చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న డీసీసీ బ్యాంకు సిబ్బంది

కడప అగ్రికల్చర్ : ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన గొప్ప మానవతావాది మదర్ థెరిస్సా అని డీసీసీ బ్యాంక్ స్పెషల్ క్యాడర్ డిప్యూటీ రిజిస్ట్రార్ గురప్ప పేర్కొన్నారు. మదర్ థెరిస్సా జయంతిని పురస్కరించుకుని సోమవారం కడప డీసీసీ బ్యాంకులో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆమె తన జీవితాన్ని నిరుపేదలకు, అనాథలకు, వ్యాధిగ్రస్తుల కోసం అంకితం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో పదవీ విరమణ డీజీఎం సత్యనారాయణ, చీఫ్ మేనేజర్ చంద్రశేఖర్, మేనేజర్లు నరసయ్య, బాలన్, సిబ్బంది పాల్గొన్నారు.

■ కడపలోని మట్టిపెద్దపులి వద్ద సోమవారం మదర్ థెరిస్సా జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. జెకే జనం కోసం సేవా సాంస్కృతిక క్రీడా, విద్యాభివృద్ధి సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు లయన్ పటాన్ ఖాదర్‌బాష, సంఘ సేవకులు షేక్ చాంద్‌బాష ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్కే సేవా సమితి రాయల్ అబ్దుల్లా కరీం, రేహాన్, అబ్దుల్లా, శంకర్, శివ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని రద్దు చేసేందుకు కుట్ర

కడప కార్పొరేషన్ : ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని రద్దు చేసేందుకు మనువాదులు కుట్ర పన్నుతున్నారని, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దళితుల పట్ల వివక్షత చూపిస్తోందని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (ఆర్పీఐ) రాష్ట్ర లీగల్ సెల్ చైర్మన్ వై.రమేష్ బాబు తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. సోమవారం నగరంలోని తన కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో దళితులపై జరిగిన దమన కాండలు అనేకం ఉన్నాయని చెప్పారు. దళితులకు రక్షణ కవచంలా ఏర్పాటు చేసిన ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని మనువాదులు, మతోన్మాదులు నిర్వీర్యం చేసి ఎత్తి వేసేందుకు కుట్ర పూరితంగా వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు.

స్టీల్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయాలి

జమ్మలమడుగు : జిల్లాలో వెంటనే స్టీల్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయాలని సీపీఎం జిల్లా నాయకుడు మనోహర్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఎన్జీఓ కార్యాలయంలో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వంలో స్టీల్ ప్లాంట్ ఏర్పాటుకు మైలవరం మండలం కంబాలదిన్నె గ్రామం వద్ద శంకుస్థాపన చేశారు. అక్కడ ఎటువంటి పనులు ప్రారంభించలేదు. ప్రభుత్వం మారిన తర్వాత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో స్టీల్‌ప్లాంట్‌కు శంకుస్థాపన తోపాటు భూములను కేటాయించారు. పనులు మాత్రం జరగలేదు. ప్రస్తుతం టీడీపీ కూటమి పార్టీ అధికారంలోకి వచ్చింది. ఎంతో కాలంగా ఎదురు చూస్తున్న ఇక్కడి నిరుద్యోగులకు ఉపాధి, ఉద్యోగావకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏసుదాసు, విజయ్, వినయ్, రాజు పాల్గొన్నారు.

జూదరుల అరెస్ట్

లింగాల: లింగాల మండలం అంబకపల్లె సమీపంలోని అటవీ ప్రాంతంలో జూదం ఆడుతున్నవారిపై పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ఏడుగురిని అరెస్ట్ చేశామని ఎస్ఐ మధుసూదన్ రావు తెలిపారు. జూదరులు ప్రొద్దుటూరు, కడప, పులివెందుల ప్రాంతాలకు చెందినవారన్నారు. జూదరుల నుంచి రూ. 76 నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు.

కృష్ణా.. ముకుందా.. మురారి

ఘనంగా కృష్ణాష్టమి పూజలు



ఉత్సవ మూర్తులకు నిర్వహించిన కళ్యాణం



స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

కడప కల్చరల్ : శ్రీకృష్ణాష్టమి వేడుకలను సోమవారం జిల్లా అంతటా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా తెల్లవారుజాము నుంచి భక్తులు స్వామిని విశేష అలంకారంలో దర్శించుకునేందుకు బారులు తీరారు. నిర్వాహకులు వారికి సులభంగా దర్శనం అయ్యేందుకు బారికేడ్లు, పందిళ్లు ఏర్పాటు చేశారు. సాయంత్రం ఆయా ఆలయాల వద్ద నిర్వాహకుల ఆధ్వర్యంలో చిన్నారులు శ్రీకృష్ణుని బాల్యం, మహిమల గురించిన నృత్యాలు, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించారు. ఆలయాల సమీపంలో యువత ఉట్టి కొట్టే కార్యక్రమాల్లో ఉత్సాహ భరితంగా పాల్గొన్నారు. రాత్రి ఆయా ఆలయాల నిర్వాహక కమిటీలు, భక్తుల కమిటీల ఆధ్వర్యంలో స్థానిక వీధుల్లో గ్రామోత్సవాలు నిర్వహించారు. హాజరైన భక్తులకు దాతలు, నిర్వాహకులు తీర్థ ప్రసాదాలు, అన్నదానాలు చేశారు. ఉదయం నుంచి శ్రీకృష్ణుని ఆలయాల వద్ద భక్తులు భారీగా చేరుకోవడంతో ఆ ప్రాంతమంతా సందడిగా మారింది.

■ కడప నగరం ద్వారకానగర్‌లోని శ్రీ మురళీకృష్ణాలయంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. అర్చక బృందం ఈ సందర్భంగా మూలమూర్తికి విశేష అభిషేకాలు, అనంతరం కనుల పండువగా అలంకారం చేశారు. ఆలయం నిర్వాహకులు కార్యక్రమాలను పర్యవేక్షించి భక్తులందరికీ ప్రసాదాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ ధ్యాన మందిరంలో ఉత్సవమూర్తిని నిలిపి పూజలు చేశారు. పలుచోట్ల సోమవారం ప్రారంభమైన పూజలు మంగళవారం సాయంత్రం వరకు కొనసాగనున్నాయి. మొదటి అంతస్తులో ఉన్న స్వామిని దర్శించుకునేందుకు ఆలయ ప్రాంగణంతో పాటు మెట్లపై కూడా బారులు తీరారు. ప్రధాన అర్చకుల బృందం ఆధ్వర్యంలో సుప్రభాతం, మూలమూర్తికి అభిషేకం, అగ్నిప్రతిష్ఠ, మూలమంత్ర పురుషసూక్త, సుదర్శన హోమాలు, పూర్ణాహుతి నిర్వహించారు. మూలమూర్తిని కనులపండుగా అలంకరించారు.

మహిళా డిగ్రీ కళాశాలలో...

వైవీయూ : కడప నగరంలోని వివేకానంద మహిళా డిగ్రీ కళాశాల (స్వయంప్రతిపత్తి)లో సోమవారం శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కళాశాల విద్యార్థినులు అందంగా ముస్తాబై కృష్ణుడుగా, గోపికలుగా వేషధారణలతో అలరించారు. అనంతరం నిర్వహించిన ఉట్టి కొట్టే కార్యక్రమంలో యువతులు ఉత్సాహంగా పాల్గొని సందడి చేశారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ డి.ఎస్.ఆర్. మనోహర్‌రెడ్డి, డైరెక్టర్ డా. ఎస్.పి. మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ శ్రీకృష్ణుని జీవితం మనకు కష్టనష్టాలను ఎలా అధిగమించాలో తెలియజేస్తుందన్నారు.

కల్యాణం.. కమనీయం..

కడప వైఎస్ఆర్ సర్కిల్: నగర శివార్లలోని 45వ డివిజన్ ఊటుకూరులోని శ్రీ కృష్ణ దేవాలయంలో సోమవారం కృష్ణాష్టమి సందర్భంగా వేడుకలను ఆలయ నిర్వాహకులు ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామి వారికి పంచామృతాభిషేకం, విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం నిర్వహించి రుక్మిణీ సత్యభామ సమేత రాధాకృష్ణుని కళ్యాణం అత్యంతం వైభవంగా నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం ఊరేగింపు చేశారు.



కడప ద్వారకానగర్‌లో విశేష అలంకారంలో శ్రీ మురళీకృష్ణుడు



స్వామి వారి దర్శనానికి క్యూలైన్‌లో భక్తులు



కృష్ణాష్టమి వేడుకల్లో కళాశాల విద్యార్థినులు







చిన్నికృష్ణుని వేషధారణలో చిన్నారులు



చిన్నారి దార్విశ్రీవర్మ

ఘనంగా శ్రీ కాలభైరవాష్టమి పూజలు



పూజల్లో పాల్గొన్న భక్తులు

కడప కల్చరల్ : కడప నగర సమీపంలోని మగ్దూమ్ సాహెబ్ కొట్టాల గ్రామంలో గల శ్రీ ఇష్టకామ్యార్థ కాలభైరవస్వామి మందిరంలో సోమవారం కాలాష్టమి సందర్భంగా పూజలను నిర్వహించారు. బాసట స్వచ్ఛంద సేవా సంస్థ దత్తత తీసుకున్న ఈ గ్రామంలో అత్యంత పురాతనమైన కాలభైరవస్వామి పూజల్లో విశేషమైనదిగా భావించే కుష్మాండ పూజల్లో పాల్గొనేందుకు పలువురు భక్తులు హాజరయ్యారు. గుమ్మడికాయను స్వామికి సమర్పించి అనంతరం వాటిపై దీపాలను వెలిగించి హారతులు ఇచ్చారు. అర్చకులు శ్రీధర్ శర్మ కాలభైరవ స్తోత్రం, అష్టోత్తర శతనామావళి నిర్వహించారు. కార్యక్రమంలో బాసట ప్రతినిధులు మేరువ బాలాజీరావు పాల్గొన్నారు.

గ్రూప్-1, 2 మెయిన్స్ పరీక్ష తేదీలు ప్రకటించాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ గ్రూప్ 1,2 మెయిన్స్ తో పాటు జూనియర్ లెక్చరర్, డిగ్రీ లెక్చరర్ ఇతర ఉద్యోగ నియామక పరీక్షల తేదీలు తక్షణమే ప్రకటించాలని , ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎన్. లెనిన్ బాబు కోరారు. సోమవారం నగరంలోని హోచిమిన్ భవన్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రూప్ 1,2 ప్రాథమిక పరీక్ష ఫలితాలు విడుదల చేశారని, మెయిన్స్ పరీక్షలు వాయిదా వేశారు అయితే ఎప్పుడు నిర్వహిస్తారనేది తెలియక అభ్యర్థులు ఆందోళనకు గురవుతున్నారన్నారు. ఈ సమావేశంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి వి గంగా సురేష్ , కార్యనిర్వాహ కార్యదర్శి కె.బ్రహ్మం, జిల్లా సహాయ కార్యదర్శి దేవా రాహుల్, నగర అధ్యక్షులు శివ నాగేంద్ర, ఉపాధ్యక్షులు నాగార్జున పాల్గొన్నారు.

జాతీయ క్రీడాదినోత్సవం విజయవంతం చేయాలి

డీఎస్‌డీఓ కె. జగన్నాథరెడ్డి



ఫిట్ ఇండియా ప్రతిజ్ఞ చేస్తున్న డీఎస్‌డీఓ, క్రీడాకారులు

కడప స్పోర్ట్స్: జాతీయ క్రీడాదినోత్సవ వేడుకలను విజయవంతం చేయాలని జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి కె. జగన్నాథరెడ్డి కోరారు. కడప నగరంలోని డీఎస్ఏ అవుట్‌డోర్ స్టేడియంలో జాతీయ క్రీడాదినోత్సవ వేడుకల్లో భాగంగా సోమవారం సాయంత్రం 'ఫిట్ ఇండియా' ప్రతిజ్ఞ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్‌డీఓ మాట్లాడుతూ హాకీ దిగ్గజం మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని ఆగస్టు 29వ తేదీన జాతీయ క్రీడాదినోత్సవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా వారంరోజుల పాటు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. క్రీడాకారులు, క్రీడాభిమానులు ఈ వేడుకల్లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో డీఎస్ఏ సిబ్బంది అక్బర్, శిక్షకులు అమృత్‌రాజ్, మునాఫ్, నూర్, సుదర్శన్ సిద్దిక్, శ్రీనివాసరాజు, విలియం కేర్, అనిల్, క్రీడాకారులు పాల్గొన్నారు.

క్రీడాసంఘాలతో సమావేశం..

జాతీయ క్రీడాదినోత్సవ వేడుకలను విజయవంతం చేయాలంటూ క్రీడాసంఘాలతో డీఎస్‌డీఓ సమావేశం నిర్వహించారు. ప్రతిరోజూ సంఘాలు, క్రీడాకారులు చేయాల్సిన కార్యక్రమాలు, సహకారంపై చర్చించారు. కార్యక్రమంలో పలు క్రీడాసంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

పాత పెన్షన్ స్కీం అమలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్‌బాబు

కడప ఎడ్యుకేషన్ : పాత పెన్షన్ పునరుద్ధరణ చేయాల్సిన ప్రభుత్వం సీపీఎస్ రద్దు చేయకుండా యూనిఫైడ్ పెన్షన్ స్కీమ్ (యూపీఎస్) పేరుతో కొత్త పెన్షన్ విధానాన్ని తీసుకురావడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్ బాబు తెలిపారు.

సోమవారం కడప యూటీఎఫ్ భవనంలో జరిగిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని నిరసిస్తూ ఈనెల 30వ తేదీ జిల్లాలోని అన్ని తాలూకా కేంద్రాల్లో నిరసన ప్రదర్శనలు నిర్వహిస్తామని తెలిపారు. ఉద్యోగుల, ఉపాధ్యాయుల వాటాతో సంబంధం లేకుండా అన్ని రకాల సదుపాయాలు ఉండే పాత పెన్షన్ కంటే మరేదీ అంగీకారం కాదన్నారు. కార్పొరేట్ షేర్ మార్కెట్ మాయాజాలానికి ఉపయోగపడే సీపీఎస్, యూపీఎస్ విధానాలను అమలు చేయడం ఆపి, పాత పెన్షన్ పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సంఘ జిల్లా సహాధ్యక్షుడు రవికుమార్, ట్రెజరర్ నరసింహారావు, ఆడిట్ కమిటీ కన్వీనర్ ప్రభాకర్, నాయకులు గాజులపల్లి గోపీనాథ్, బత్తుల చంద్రశేఖర్, యడాల సురేష్ కుమార్, కరిముల్లా, కృష్ణారెడ్డి, కేదార్‌నాథ్, కిరణ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

శాంతి భద్రతల పరిరక్షణకు తోడ్పాటు అందించాలి

వల్లూరు (చెన్నూరు) : శాంతి భద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమవంతుగా తోడ్పాటు అందించాలని చెన్నూరు సీఐ పురుషోత్తమరాజు సూచించారు. సోమవారం స్థానిక పోలీసుస్టేషన్‌లో హిందూ, ముస్లిం పెద్దలతో పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ చెన్నూరులోని ట్రంకు రోడ్డు సమీపంలో శ్రీ లలితాంబిక నాగేశ్వర స్వామి వారి ధ్వజస్తంభ ప్రతిష్ఠ మూడు రోజుల పాటు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని సూచించారు. శివాలయం ఎదురుగా మసీదు ఉండడంతో వారికి ఏమాత్రం ఆటంకం కలగకుండా పూజలు నిర్వహించాలన్నారు. ఉత్సవాలకు సంబంధించి సమస్యలు ఉన్నట్లయితే వెంటనే దృష్టికి తీసుకురావాలన్నారు. సమావేశంలో పీస్ కమిటీ సభ్యులు జీఎన్ భాస్కర్ రెడ్డి, ప్రసాద్‌బాబు పాల్గొన్నారు.

ఆశా వర్కర్స్ జాతీయ సమ్మేళనాలు జయప్రదం చేయాలి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న దృశ్యం

కడప వైఎస్ఆర్ సర్కిల్ : సెప్టెంబరు 1,2,3 తేదీలలో విశాఖపట్నంలో జరుగుతున్న ఏఐటీయూసీ జాతీయ సమ్మేళనాలను జయప్రదం చేయాలని ఏఐటియూసీ జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్, ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు పి. సుభాషిణి పిలుపునిచ్చారు. సోమవారం నగరంలోని కార్యాలయంలో జాతీయ సమ్మేళాలకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం మూడవసారి అధికారం లోనకి వచ్చినప్పటినుండి కార్మిక హక్కులను కాలరాయడమే ధ్యేయంగా పనిచేస్తోందన్నారు. ఏఐటీయూసీ జాతీయ సమ్మేళనాలలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పైన చర్చించి దేశవ్యాప్తంగా ఆందోళనకు సిద్ధమవుతామన్నారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు యు .మరియమ్మ, వర్కింగ్ ప్రెసిడెంట్ బి శాంతమ్మ, ఏఐటీయూసీ జిల్లా నాయకులు పి. చంద్రశేఖర్, ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కోశాధికారి సి. అమ్ములు, జిల్లా ఉపాధ్యక్షులు టి. అనసూయ, కె.వరలక్ష్మి పాల్గొన్నారు.

క్లాప్ ప్రోగ్రాంను కొనసాగించాలా.. రద్దు చేయాలా..

- చెత్త పన్ను రద్దు చేస్తామని నోటిమాటగానే చెప్పారు...జీవో ఇవ్వలేదు
- టీడీపీ ప్రభుత్వం చెప్పిందని ఎవరూ చెత్త పన్ను చెల్లించడంలేదు
- దీనిపై క్లారిటీ ఇవ్వాలని అధికారులు అడుగుతున్నా ప్రభుత్వం పట్టించుకోలేదు
- కడప మేయర్ కె. సురేష్ బాబు ధ్వజం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కడప మేయర్ కె. సురేష్ బాబు

కడప కార్పొరేషన్ : క్లీన్ ఆంధ్రప్రదేశ్(క్లాప్) ప్రోగ్రాంను కొనసాగించాలా...రద్దు చేయాలా అన్నది ప్రభుత్వం తేల్చిచెప్పాలని కడప మేయర్ కె. సురేష్ బాబు నిలదీశారు. సోమవారం కడప కార్పొరేషన్ కార్యాలయంలోని తన ఛాంబర్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కొత్త బిచ్చగాడు పొద్దెరగడు అన్నట్లు కడప ఎమ్మెల్యే మాధవి వ్యవహారం ఉందని ఎద్దేవా చేశారు. చెత్త తీసుకుపోయి కార్పొరేటర్లు, మేయర్ ఇళ్లలో వేయాలని ఆమె మాట్లాడం సబబు కాదని హితవు పలికారు. ఎన్నికల ముందు చెత్త పన్నుపై టీడీపీ నేతలు ఇష్టానుసారంగా మాట్లాడారని, తాము అధికారంలోకి వస్తే రద్దు చేస్తామని హామీలిచ్చారన్నారు. చెత్త పన్ను రద్దు చేస్తామని టీడీపీ ప్రభుత్వం చెప్పిందే తప్పా అందుకు సంబంధించిన జీవో ఇంతవరకూ ఇవ్వలేదన్నారు. ప్రతిరోజూ టెలీకాన్ఫరెన్స్‌లు నిర్వహించే మున్సిపల్ శాఖామంత్రి నారాయణ కూడా ఈ చెత్త పన్నుపై క్లారిటీ ఇవ్వడం లేదన్నారు. అధికారులు దీనిపై స్పష్టత ఇవ్వాలని ప్రభుత్వానికి లేఖలు రాసినా తిరుగు సమాధానం లేదన్నారు. ఈ పరిస్థితి చూసి తిరుపతి, అనంతపురం, నెల్లూరు, చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్లలో క్లాప్ ఆటోలను నిలిపివేశారని, సాక్షాత్తు మున్సిపల్ శాఖామంత్రి నారాయణ ప్రాతినిధ్యం వహిస్తున్న నెల్లూరు కార్పొరేషన్‌లో కేవలం 15 ఆటోలు మాత్రమే తిరుగుతున్నాయని ఎద్దేవా చేశారు. కడప నగరం అపరిశుభ్రంగా తయారు కాకూడదని తాము మూడు మాసాలుగా క్లాప్ ఆటోలను తిప్పుతూనే ఉన్నామని, కొన్ని అనివార్య కారణాలతో 20 ఆటోలు మాత్రమే నిలిచిపోయాయని, 70ఆటోల ద్వారా నిత్యం చెత్త సేకరణ జరుగుతోందన్నారు. ప్రజలు ఇచ్చే యూజర్ చార్జీలతో రెడ్డి కన్సల్టెంట్స్, సాయి పావనీ ఏజన్సీలకు డబ్బులు చెల్లించే వారమని, ప్రజలు యూజర్ చార్జీలు ఇవ్వనందున ఈ మూడు నెలల్లో రూ.5.60 కోట్లు వారికి బకాయి పడ్డామన్నారు. ఈ డబ్బు ప్రభుత్వం చెల్లిస్తుందా...మరెవరైనా చెల్లిస్తారా అని మేయర్ ప్రశ్నించారు.

■ 2021లో క్లాప్ ప్రోగ్రాంను అమలు చేయాలని ఆదేశాలు వచ్చాయన్నారు. మురికివాడల్లో రూ.40, మిగతా చోట రూ.90 వసూలు చేయాలని తీర్మానించి 2022 నుంచి అమలు చేశామన్నారు. ఈ ప్రోగ్రాం అమలు ద్వారా కార్పొరేషన్‌కు రూ.75లక్షలు ఖర్చు వస్తుందని, ప్రజలు ఇచ్చే యూజర్ చార్జీల ద్వారా రూ.35లక్షలే వస్తున్నాయన్నారు. ఒక ఆటోకు డ్రైవర్, ఇద్దరు వర్కర్లు చొప్పున 200 మంది వర్కర్లను అదనంగా నియమించామన్నారు.

■ కడప నగరపాలక సంస్థకు ఆస్థిపన్నులు, నీటి పన్నులు, టౌన్‌ప్లానింగ్ ద్వారా ఏడాదికి రూ.75 కోట్లు వస్తాయని, ఇందులో ప్రతినెలా ఆప్కాస్‌లో వర్కర్ల జీతాలకు రూ.2.30కోట్లు, కార్పొరేషన్‌లో వివిధ రకాల వాహనాలు 73 ఉన్నాయని, వాటికి డీజిల్, పెట్రోల్‌కు రూ.40లక్షలు ఖర్చవుతోందన్నారు. నీటిని పంప్ చేయడానికి కరెంట్ ఖర్చు రూ.1.30కోట్లు, ఎల్‌టీ బిల్ రూ.1.01కోట్లు, అదనపు వర్కర్లకు రూ.55లక్షలు జీతాలు చెల్లిస్తున్నామన్నారు. దీంతో మొత్తంగా ఏడాదికి రూ.72కోట్లు ఖర్చులు ఉన్నాయన్నారు. ఇవి కాకుండా కాంట్రాక్టర్ల రూ.40కోట్లు బిల్లులు చెల్లించాల్సి ఉందన్నారు.

■ మేం 30 ఏళ్లుగా రాజకీయాల్లో ఉన్నాం...ఎమ్మెల్యే మాధవి ఇదివరకూ రాజకీయాలు చేసి ఉంటే ఇవన్నీ తెలిసి ఉండేవని, తెలియకపోతే నేర్చుకోనైనా మాట్లాడాలన్నారు. ఆమెకు చిత్తశుద్ధి ఉంటే ఎమ్మెల్యేగా అసెంబ్లీలో మాట్లాడి క్లాప్ ప్రోగ్రాంపై స్పష్టత ఇప్పించాలన్నారు.

■ కడప నగరానికి శాశ్వతంగా నీటి సమస్యను దూరం చేయడానికి మాజీ సీఎం వైఎస్ జగన్ బ్రహ్మంసాగర్‌లో 1.5 టీఎంసీల నీటిని కడపకు నికర జలాలుగా కేటాయించారని, టీడీపీ ప్రభుత్వం రాగానే ఆ పనులు ఆగిపోయాయన్నారు. సబ్ సర్ఫేజ్ డ్యామ్‌ల వల్ల ఎలాంటి ఉప యోగం ఉండని, రైతుల ఆందోళనతో అన్ని చోట్ల అవి కట్టాల్సి వస్తుందని ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు.

ఈ సమావేశంలో కార్పొరేటర్లు ఎం. రామలక్ష్మణ్‌రెడ్డి, కె. బాబు, షంషేర్, మల్లికార్జున, కె. సూర్యనారాయణ రావు, అజ్మతుల్లా, డివిజన్ ఇన్‌చార్జులు శ్రీరంజన్‌రెడ్డి,కిరణ్, గౌస్ పాల్గొన్నారు.

నేడు ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి జన్మదిన వేడుకలు

కమలాపురం: కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి జన్మదిన వేడుకలను మంగళ వారం ఘనంగా నిర్వహిస్తున్నట్లు హార్టికల్చర్ మాజీ స్టేట్ అడ్వైజర్ సంబటూరు ప్రసాద్ రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం స్థానిక అనాథ బాలుర ఛాత్రాలయంలో కేక్ కట్ చేయడంతో పాటు విద్యార్థులకు అన్నదానం చేస్తున్నట్లు ఆయన తెలిపారు. అనంతరం పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేస్తామన్నారు. తర్వాత దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తామన్నారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడంతో పాటు రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేస్తామని ఆయన అందులో పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి పార్టీ కార్యకర్తలు, నాయకులు, అభిమానులు హాజరు కావాలన్నారు.

గ్యాస్ లీకై మంటలు

రాజంపేట రూరల్ : పట్టణంలోని అన్నపూర్ణ హోటల్ గోడౌన్‌లో సోమవారం గ్యాస్ లీకై మంటలు చెలరేగాయి. అప్రమత్తమైన సిబ్బంది యజమాని మురళీ దృష్టికి తీసుకురావడంతో ఆయన అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. హుటాహుటిన ఫైర్ అధికారి సుభాన్ తన సిబ్బందితో వెళ్లి మంటలు ఆర్పడంతో పెను ప్రమాదం తప్పింది.